

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

## మృతుడి కుటుంబానికి పరామర్శ

బెజ్జంకి, ఫిబ్రవరి 22 : మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన చిలుముల కొమురయ్య ఇటీవల దుబాయ్‌లో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గురువారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, సంజీవరెడ్డి, ఇస్తారి, పోచయ్య, శంకర్, కుమార్, సతీశ్ తదితరులు ఉన్నారు.

## ‘గృహజ్యోతి’ని సద్వినియోగం చేసుకోవాలి

**ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్**

చేర్యాల, ఫిబ్రవరి 22 : గృహజ్యోతి పథకం భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందేందుకు ఈనెల 24 వరకు గడువు ఉందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్ సూచించారు. గురువారం పట్టణంలోని ఏడీఈ కార్యాలయంలో చేర్యాల టౌన్, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల ట్రాన్స్‌కో ఏఈలు, సిబ్బందితో డీఈ గృహజ్యోతి పథకం, కరెంట్ సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్ర, శనివారంలోపు విద్యుత్ వినియోగదారులు తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌ను వారి సర్వీస్ నంబర్‌తో అనుసంధానం చేయించుకోవాలన్నారు. గృహజ్యోతి పథకాన్ని అమలు చేయించేందుకు విద్యుత్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తు నంబర్, రేషన్‌కార్డు నంబర్, ఆధార్‌కార్డు నంబర్, ఫోన్ నంబర్ పేపర్‌పై పొం దుపరిచి ఆయా మండల కేంద్రాల్లో విద్యుత్ కార్యాలయాలు, బిల్లులు చెల్లించే ప్రదేశాలతోపాటు సబ్‌స్టేషన్ల వద్ద సిబ్బందికి అందజేయాలన్నారు. రైతులకు 24 గంటలపాటు నిరంతరంగా కరెంట్ సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో చేర్యాల ఏడీఈ రత్నాచారి, టౌన్ ఏఈ తస్రీబ్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 22 : సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పొద్దుతిరుగుడు విత్తన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సుడా మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంట మార్పిడిలో భాగంగా రైతులు పొద్దుతిరుగుడు పంట సాగు చేశారన్నారు. గతేడాది దాదాపు 4 వేల మంది రైతులు 37,900 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు పంట పండించారని తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో గతేడాది రాష్ట్రంలోనే మొదట సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో పొద్దుతిరుగుడు విత్తన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఈసారి సిద్దిపేట నియోజకవర్గంలో 2 వేల మంది రైతులు 3 వేల ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంట సాగు చేశారని, మద్దతు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొద్దుతిరుగుడు పంటకు మద్దతు ధర రూ.6,760 ఉండగా, మార్కెట్‌లో రూ.4 వేల నుంచి రూ.5 వేలకు మాత్రమే రైతులు అమ్ముకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పొద్దుతిరుగుడు విత్తన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దరిపల్లి శ్రీను, నాయకులు సత్తిరెడ్డి, మోయిజ్, సంతోష్, హేమంత్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన



మిరుదొడ్డి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై భువనేశ్వర్‌రావు

గజ్వేల్, ఫిబ్రవరి 22 : మండలంలోని జాలిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, మహిళా రక్షణ చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సామాజిక రుగ్మతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సైలు సత్యనారాయణరెడ్డి, శ్రీరాములు మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కావొద్దన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పే విషయాలను జాగ్రత్తగా విని ముందుకు సాగాలన్నారు. హెచ్‌ఎం బస్వరాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

చేర్యాల, ఫిబ్రవరి 22 : విద్యార్థులు లక్ష్యానికి అనుగుణంగా కష్టపడి చదువుకోవాలని సీఐ ఎల్.శ్రీను సూచించారు. గురువారం పట్టణంలోని ప్రజంటేషన్ హైస్కూల్‌లో చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని విద్యార్థులు ఇష్టపడి చదువుకోవాలన్నారు. చదువు ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చని చెప్పారు. అపరిచితులతో ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉం డాలని, సైబర్ నేరగాళ్లతో అప్రమత్తగా ఉండాలన్నారు. విద్యార్థినులను ఎవరైనా వేధించినా.. వెంబడించినా వెంటనే 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. హెచ్ ఎం లార్డ్‌మేరీ, ఉపాధ్యాయు లు, హుస్నాబాద్ షీటీం సభ్యులు పాల్గొన్నారు.

### క్రమ శిక్షణతో విద్యనభ్యసించాలి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఫిబ్రవరి 22 : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమ శిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భూంపల్లి ఎస్సై భువనేశ్వర్‌రావు ఆకాంక్షించారు.అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ జడ్పీ పాఠశాలలో మహిళల రక్షణ చట్టాలు, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, చట్టాలపై విద్యార్థులకు అవగాన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు ఏకగ్రతతో విద్యనభ్యసిస్తూ సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జగన్మోహన్‌రావు, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యంతో పోలీసులు

చేర్యాల, ఫిబ్రవరి 22 : బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 12 టన్నుల రేషన్ బియ్యాన్ని చేర్యాల-ఆకునూరు ప్రధాన రహదారిలో గురువారం సిద్దిపేట టాస్క్ ఫోర్స్, చేర్యాల పోలీసులు పట్టుకున్నారు. నిందితులు నూనె శేఖర్, నల్లమల శ్రీధర్, కల్యాణపురం సిమిలర్ ముగ్గురు కలిసి అకునూరుతోపాటు పలు గ్రామాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా రవాణా చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బొలెరో (టీఎస్-36, టీ-3011) వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంతోపాటు ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం పోలీసులు మాట్లాడుతూ ఇసుక, రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసినా, నిల్వ చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

# తాగునీటి కొరత లేకుండా చూడాలి

**జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ**

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 22 : వేసవికాలంలో తాగునీటి కొరత లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన 5వ స్థాయీ సంఘ (స్త్రీ మరియు శిశు సంక్షేమం), 6వ (సాంఘిక సంక్షేమం), 7వ (పనులు), 1వ (ఆర్థిక మరియు ప్రణాళిక) స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లాలో 66 మంది మినీ అంగన్‌వాడీలను అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేశామన్నారు. ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేసే ప్రక్రియను చేపట్టాలన్నారు. వేసవికాలం దృష్ట్యా నీటి ఎద్దడి రాకుండా చూడాలని, అందుకోసం మిషన్ భగీరథలో ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే వాటిని పూర్తి చేయాలన్నారు. చేర్యాల-జనగామ, సిద్దిపేట-మెదక్ జాతీయ రహదారుల పనులు వేగవంతం చేయాలని చెప్పారు. ఓవర్ లోడ్ కెపాసిటీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయంగా ట్రా న్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాజమౌళి

## కేసీఆర్ సహకారంతోనే గజ్వేల్ అభివృద్ధి

- మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి
- మున్సిపల్ వార్షిక బడ్జెట్ ఆమోదం

గజ్వేల్, ఫిబ్రవరి 22 : గడిచిన నాలుగేండ్లలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహకారంతో గజ్వేల్ మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చెందిందని, బీఆర్ఎస్ హయాంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు పూర్తి చేశామని మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, పాలకవర్గ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్‌తో కలిసి ఎన్సీ రాజమౌళి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2024-25 వార్షిక బడ్జెట్ అంచనా రూ.18.06 కోట్లు కాగా, సొంత ఆదాయం అంచనా రూ.13.44 కోట్లు, గ్రాంట్ల ద్వారా ఆదాయం అంచనా రూ.4.62 కోట్లు, గ్రీన్ బడ్జెట్ రూ.1.73 కోట్లు, కొత్తగా విలీనమైన ప్రాంతాల్లో క్లిష్టమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.0.64 కోట్లను ప్రవేశపెట్టామని వివరించారు. వివిధ కేటగిరీలవారీగా ఆదాయ అంచనాలు రూ.12.97 కోట్లు, వివిధ కేటగిరీలవారీగా కేటాయింపులు రూ.13.16 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టామన్నారు. ఇందులో రూ.27.86 కోట్లు మిగులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని చెప్పారు. రాష్ట్రంలోని 144 మున్సిపాలిటీల్లో గజ్వేల్‌ను ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేశామన్నారు. గతంలో గజ్వేల్ మున్సిపాలిటీకి అవార్డులు వచ్చాయని, అందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో సహకరించిందన్నారు. రూ.100 కోట్లతో యూజీడీ పనులను పూర్తిచేశామని, పారిశుద్ధ పనులు, వీధి లైట్ల ఏర్పాటు, డం పింగ్‌యార్డు నిర్మాణం, హరితహారంలో మొ క్కల పెంపకం చేపట్టామన్నారు. మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, అధికారులు పాల్గొన్నారు.

## సిద్దిపేట బల్దియా వార్షిక బడ్జెట్ రూ.98.51 కోట్లు

- బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల
- ఆమోదం తెలిపిన పాలకవర్గ సభ్యులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 22 : 2024-25 సంవత్సరానికి సిద్దిపేట మున్సిపాలిటీకి రూ.98.51 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గురువారం పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు అధ్యక్షతన జరిగిన వార్షిక బడ్జెట్ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వార్షిక బడ్జెట్‌కు ఏకగ్రీవ ఆమోదం తెలిపిన పాలకవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషితో సిద్దిపేట పట్టణం రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. దేశవ్యాప్తంగా సిద్దిపేట మున్సిపాలిటీకి ఇంత పేరు, ప్రఖ్యాతలు రావడానికి కారణమైన హరీశ్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పట్టణానికి మరిన్ని అవార్డులు వచ్చేలా కృషి చేయాలన్నారు. పట్టణంలో ప్రారంభించిన రుతుప్రేమ, సిద్దిపేట స్వచ్ఛబడి దేశంలోని ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

## 26 నుంచి యోగా శిక్షణ తరగతులు

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 22 : హుస్నాబాద్‌లో ఈనెల 26 నుంచి యోగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ము న్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగా శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టణంలోని శివాజీనగర్‌లో నిర్వహించే యోగా శిక్షణ కోసం ఆసక్తిగలవారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

## రమేశ్‌కు ప్రగతిరత్న అవార్డు ప్రదానం

చేర్యాల, ఫిబ్రవరి 22 : మండలంలోని చుంచనకోట గ్రామానికి చెందిన ఆలేటి రమేశ్ స్వామివివేకానంద లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. సమాజ సేవా రంగంలో రచయితలకు ఏటా వల్లూరి ఫౌండేషన్ తెలంగాణ సంస్థ స్వామివివేకానంద లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందజేస్తున్నది. ఈసారి రమేశ్‌కు ప్రగతి రత్న అవార్డును గురువారం సంస్థ ప్రకటించింది.

## ఈసారి బెక్కల్ ‘ఆలయ పాలక మండలి’ లేనట్లేనా..?

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 23 : కాకతీయుల కాలంలో నిర్మించిన అతిప్రాచీన శైవ ఆలయంగా ప్రసిద్ధి చెందిన బెక్కల్ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 24(రేపటి) నుంచి ప్రారంభంకానున్నాయి. అయితే, ఏటా బ్రహ్మోత్సవాలకు నెల రోజుల ముందే ప్రభుత్వం.. ఆలయ పాలకమండలిని నియమించేది. ఈసారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నా పాలక మండలిని ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. పాలక మండలిని ఏర్పాటు చేయకపోవడంతో ఈ ఏడాది బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు అంతంతమాత్రంగానే చేస్తున్నారు. ఆలయ చైర్మన్‌తోపాటు ఐదుగురిని సభ్యులుగా నియమించడం ఏండ్ల తరబడి ఆనవాయితీగా వస్తున్నది. ఈ ఆనవాయితీకి ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చింది. దేవాదాయశాఖ 20 రోజుల క్రితమే పాలకమండలి ఏర్పాటుకు నోటిపికేషన్ ఇచ్చినప్పటికీ స్థానిక కాంగ్రెస్ నాయకులు శ్రద్ధ కనబర్చడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం వెంటనే ఆలయ పాలక మండలిని ప్రకటించి బ్రహ్మోత్సవాలను ఘనం గా నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

## మొక్కల సంరక్షణపై శ్రద్ధ వహించాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 22 : మొక్కల సంరక్షణపై అధికారులు శ్రద్ధ వహించాలని ఎంపీడీవో రామ్మోహన్ సూచించారు. గురువారం మద్దూరు మండలం ధర్మారం, మర్మాముల, సలాఖపూర్ గ్రామాల్లోని హరిత నర్సరీలను ఎంపీడీవో పరిశీలించారు. ఆయన వెంట ఈసీ పరశురాములు ఉన్నారు.

# గద్దెలపై కొలువుదీరిన వనదేవతలు



మద్దూరు : కూటిగల్‌లో గద్దెపై సమ్మక్క విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న కోయ పూజారులు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 22 : ధూళిమిట్ట మండలంలోని కూటిగల్ సమ్మక్క-సారలమ్మ జాతరలో భాగంగా రెండో రోజు సమ్మక్క తల్లి గద్దెలపైకి చేరుకుంది. డప్పుచప్పుళ్లు, ఒగ్గు కళాకారుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య కోయ పూజారులు గ్రామానికి తూర్పు వైపు నుంచి సమ్మక్కను మట్టి కుండల్లో ఊరేగింపుగా తీసుకొచ్చారు. మొదటిరోజు సారలమ్మ గద్దెలపైకి చేరుకోగా, రెండోరోజు సమ్మక్కతోపాటు పగిడిద్దరాజు, లక్ష్మీదేవి గద్దెలపైకి చేరుకున్నారు. వనదేవతలు గద్దెలపై కొలువుదీరడంతో అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నిలువెత్తు బంగారం, ఎదురుకోళ్లతో అమ్మవార్లకు భక్తు లు మొక్కులు చెల్లించుకున్నారు.

### వనదేవతలకు భక్తుల నీరాజనం..

బెజ్జంకి, ఫిబ్రవరి 22 : మండలంలోని దేవక్కపల్లి, తోటపల్లి, వడ్లూర్, గుండారం గ్రామాల్లో సమ్మక్క-సారలమ్మ జాతర ఘనంగా జరిగింది. సమ్మక్క- సారలమ్మలు గద్దెలపైకి చేరగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎత్తుబంగారం, ఎదురుకోళ్లు, తలానీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### గద్దెనెక్కిన సమ్మక్క..

కొమురవెల్లి, ఫిబ్రవరి 17 : సమ్మక్క -సారలమ్మ జాతరలో భాగంగా రెండోరోజు సమ్మక్క గద్దెనెక్కింది. గురువారం సమ్మక్క తల్లికి నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేసి చిలుకల గుట్ట నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చారు. దీంతో కీలకఘట్టం ముగిసింది.

## పీహెచ్‌సీని సందర్శించిన ఒడిశా వైద్య బృందం



ఒడిశా వైద్య బృందంతో పీహెచ్‌సీ సిబ్బంది

కుకునూర్‌పల్లి, ఫిబ్రవరి 22 : మండల కేంద్రంలోని పీహెచ్‌సీ కేంద్రాన్ని గురువారం ఒడిశాకు చెందిన వైద్యుల బృందం సందర్శించింది. ఒడిశాకు చెందిన వైద్యులు సుమన్, సుమంత్ ఆధ్వర్యంలో 53 మంది బృందం సభ్యులు కుకునూర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, ఇమ్యునైజేషన్, ప్రసూతి, ప్రభుత్వ పథకాలు, ఓపీ, ఐపీ, వాక్సినేషన్ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ రజిని, డాక్టర్ బల్వీందర్‌సింగ్, డాక్టర్ పర్వీన్ ఇక్కడ అందిస్తున్న వైద్య సేవల గురించి బృందం సభ్యులకు వివరించారు.

## వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ దంపతులు**

హుస్నాబాద్, ఫిబ్రవరి 22 : హుజూరాబాద్ మండలం సింగాపురం గ్రామంలో గురువారం వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్-డాక్టర్ షమిత దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సతీశ్ కుమార్ మాట్లాడుతూ వేంకటేశ్వర స్వామి కృపతో హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఉత్సవాలకు హుస్నాబాద్ నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.



బ్రహ్మోత్సవాల్లో హోమం నిర్వహిస్తున్న సతీశ్‌కుమార్-షమిత దంపతులు

## రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం

కొండపాక, ఫిబ్రవరి 22 : మండలంలోని మర్పడగ రెవెన్యూ పరిధిలో ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన 1061 సర్వే నంబర్‌లో 130 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నదని గ్రామస్తులు తెలిపారు. ఇటీవల గ్రామస్తులు హైదరాబాద్‌లోని జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌లో రాష్ట్రస్థాయి అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ అవసరాల కోసం భూమి కావాలని పోరాడుతున్న వారిపై గురువారం కొందరు గొడవకు దిగడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రాజమల్లయ్యను ఆదర్శంగా తీసుకోవాలి



హుస్నాబాద్ టౌన్ : రాజమల్లయ్య అభినందన కార్యక్రమంలో చైర్‌పర్సన్ రజితావెంకన్న

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 22 : పీడీ రాజమల్లయ్యను యువత ఆదర్శంగా తీసుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న సూచించారు. హుస్నాబాద్‌కు చెందిన ఫిజికల్ డైరెక్టర్ బూట్ల రాజమల్లయ్య పుట్టిన రోజు సందర్భంగా గురువారం 21 కిలో మీటర్ల హాఫ్ మారథాన్ నిర్వహించారు. అనంతరం గాంధీ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో రాజమల్లయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ 53 ఏండ్ల వయస్సులో రాజమల్లయ్య 21 కిలోమీటర్ల పరుగును నిర్వహించడం అభినందనీయమన్నారు. వైస్ చైర్‌పర్సన్ అని త, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య పాల్గొన్నారు.



అయోధ్యకు చేరుకున్న యువకులు

## అయోధ్యకు చేరుకున్న యువకులు

కుకునూర్‌పల్లి, ఫిబ్రవరి 22 : కుకునూర్‌పల్లి మండలం ముద్దాపూర్ గ్రామానికి చెందిన వడ్లకొండ సాయికిరణ్, మెదినీపూర్‌కు చెందిన రెడ్డమైన శేఖర్ శ్రీరాముడి శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యకు గురువారం చేరుకున్నారు. ఛత్రపతి శివాజీ జయంతి రోజున బైక్‌పై అయోధ్యకు బయల్దేరిన యువకులు మూడురోజుల తర్వాత అయోధ్యకు చేరుకున్నారు.

## ముగిసిన రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 22 : పట్టణంలో మూడు రోజులపాటు జరిగిన రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం సామూహిక కుంకుమార్చనలు, అన్నప్రసాద వితరణ చేశారు. ఉత్సవాల్లో గౌడసంఘం పెద్దలు గణేశ్‌గౌడ్, అశోక్‌గౌడ్, రాజమల్లయ్యగౌడ్, రాజాగౌడ్, నరేశ్‌గౌడ్, వెంకట్‌గౌడ్, దేవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

### వర్గల్‌లో..

వర్గల్, ఫిబ్రవరి 22 : వర్గల్ విద్యాధరి సరస్వతీమాత ఆలయ 32వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక అధ్యక్ష, చైర్మన్ బ్రహ్మశ్రీ శ్రీయాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేదమూర్తులు అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని హైకోర్టు జడ్జి దయానందరావు, ఓఎస్డీ శ్రీమన్నారాయణ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన రామకృష్ణ దంపతులు సరస్వతీమాతకు వెండి హంస వాహనాన్ని బహూకరించారు.

## నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

గజ్వేల్, ఫిబ్రవరి 22 : మున్సిపల్‌లో జరిగిన నిధుల దుర్వినియోగంపై జిల్లా అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందనబోయిన ఎల్లయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పనులు చేయకుండానే నిధులు డ్రా చేశారన్న కౌన్సిలర్లు ఆరోపణపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ జమ పద్దులను మొత్తం బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

## మార్కెట్‌లో విక్రయాలు జరిగేలా చూడాలి

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 22 : గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌లో కూరగాయలు, పండ్లు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని కూరగాయల వ్యాపారులు అధికారులను కోరారు. ఈ మేరకు వ్యాపారులు గురువారం మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఆర్డీవో బన్సీలాల్, ఏఎంసీ కార్యదర్శి జాన్‌వెస్లీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సమీకృత మార్కెట్‌కు కిలోమీటర్ పరిధిలో ఎవరూ కూరగాయలు, పండ్లు విక్రయించకూడదనే నిబంధన ఉందని, ఆ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని చెప్పారన్నారు. కానీ, ఇప్పుడు మార్కెట్ ముందున్న రోడ్లపై కూరగాయలు, పండ్లు, పూలు తదితర వస్తువులను విక్రయిస్తున్నారన్నారు. బుధవారం అంగడికి మార్కెట్ పార్కింగ్ ప్లేస్‌గా మారిందని, సమీకృత మార్కెట్‌లోకి ప్రజలెవరూ వచ్చి కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగడిని మార్కెట్‌కు కిలోమీటర్ దూరంలో నిర్వహించాలన్నారు. కాగా, మార్కెట్ బయట కూరగాయలు, పండ్లు విక్రయించడాన్ని నిరసిస్తూ వ్యాపారులు తమ దుకాణాలు మూసివేశారు.

## అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

వర్గల్, ఫిబ్రవరి 22 : సెంట్రింగ్ బాక్స్‌లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణంలో గజ్వేల్ ఏసీపీ బాలాజీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గురువారం వర్గల్ కమాన్ వద్ద గజ్వేల్ రూరల్ సీఐ శివకుమార్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అశోక్ లేలాండ్ వాహనంలో సెంట్రింగ్ డబ్బాలు తీసుకెళ్తున్నట్లు అనుమానం వచ్చి వెంటనే లారీలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. ముడావత్ హరి (28) పడమటితండా, నల్గొండ జిల్లా వాసి, జరపుల రాంలాల్(33) గాజీనగర్ నల్గొండ జిల్లావాసిగా గుర్తించారు. ఈ ఇద్దరు నిందితులు కొంతకాలంగా సెంట్రింగ్ డబ్బాలను దొంగిలిస్తూ హైదరాబాద్‌లోని సబావత్ సత్తయ్యకు చెందిన స్క్రాప్ దుకాణంలో అమ్ముతున్నారు. ఇద్దరు నిందితులతోపాటు మరో 17 మందిపై గౌరారం పోలీస్‌స్టేషన్ పరిధితోపాటు గజ్వేల్, సిద్దిపేట, శివ్వంపేట, కొడిపల్లి, నర్సాపూర్, మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 11 కేసులు నమోదైనట్లు ఏసీపీ తెలిపారు. త్వరలోనే మిగితా 17 మందిని పట్టుకుంటామని చెప్పారు.